పుట్టుకతోనే ఎవరూ ప్రయోజకులు కాలేరు

- సమాజంలో అందరూ సమానమే
- తెలంగాణ పోలీసుల కీర్తి దేశానికే తలమానికం
- 'మార్పు కోసం ముందడుగు'తో నేరస్తుల్లో కొత్త జీవితం
- రాచకొండ జాయింట్ కమిషనర్ సత్యనారాయణ
- రాచకొండ సీసీఎస్ పోలీసుల సౌజన్యంతో పాతనేరస్తులకు అవగాహన



సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న రాచకొండ పోలీసు కమిషనరేట్ జాయింట్ సీపీ సత్యనారాయణ, కార్యక్రమానికి హాజరైన పాత నేరస్థులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: పుట్టుకతోనే ఎవరూ ప్రయోజకులు కాలేరని, మనిషిలో దాగి ఉన్న గొప్ప మనస్సుతోనే సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తోందని, చెడు లక్షణాలను దూరం చేసి మంచి నడవడికతో ముందడుగు వేయాలని రాచకొండ పోలీసు కమిషనరేట్ జాయింట్ సీపీ సత్యనారాయణ అన్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా దమ్మాయిగూడలోని సాయి భవాని ఫంక్షన్ హాలులో శనివారం 'మార్పు కోసం ముందడుగు' అనే కార్యక్రమంపై డీసీపీ మధుకర్‌స్వామి, అడిషినల్ డీసీపీ లక్ష్మి, మల్కాజిగిరి సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సైదులు ఆధ్వర్యంలో 9 పోలీస్ స్టేషన్ల పరిధిలోని పాత నేరస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. చెడుతో ఏమీ సాధించలేమని, మంచితో సమాజంలో గొప్ప కీర్తి ప్రతిష్టలు దక్కుతాయన్నారు. నేరస్తులు సన్మార్గంలో నడిస్తేనే జీవితంలో తలెత్తుకుని జీవిస్తారన్నారు. ఆధునిక ప్రపంచంలో అందరికీ ఎన్నో అవకాశాలు లభిస్తున్నాయని, 20 ఏళ్లల్లో వచ్చే పేరు.. 60 ఏళ్లల్లో వచ్చే రోగం ఎప్పటికి పోదని, మంచితనమే చిరస్థాయిగా నిలుస్తోందని ఆయన తెలిపారు. నేరానికే పాల్పడితే అనుభవించే శిక్షను చూస్తుంటే.. కుటుంబ సభ్యులు సమాజంలో అనుభవించే బాధను చూస్తే గుండె కరిగిపోతుందన్నారు. నేరవృత్తిని వీడి సమాజంలో మంచిని సంపాధించాలని ఉద్బోధించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాత నేరస్తులకు నోటు పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ గిరిధర్, సైక్రియాటిస్టు బండి గణేష్, సివిల్స్ కోచింగ్ ఉపన్యాసకుడు ఆకెళ్ల రాఘవేంద్రనందకుమార్, ప్రొఫెసర్ లక్ష్మికుమారి, రాజ్‌కుమార్, లయన్స్‌క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ రాఘునాథ్ రెడ్డి, ఏసీపీ ఫింగర్ ప్రింట్స్ రఘు, ఇన్‌స్పెక్టర్లు సైదులు, వీవీ రెడ్డి, నవీన్‌రెడ్డి, మల్కాజిగిరి ఎస్వోటీ రాములు, ఎస్సైలు, పోలీసులతో సహా 150 మంది పాతనేరస్తులు పాల్గొన్నారు.

కష్టాన్నే పెట్టుబడిగా మలుచుకోవాలి



కష్టాన్నే పెట్టుబడిగా మలుచుకుని అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ.. ముందుకు సాగితే మనిషికి భవిష్యత్తు ఉంటుంది. సమాజంలో మంచి, చెడులను బేరీజు చేసుకుని మంచి దిశగా అడుగులు వేయాలి. పుట్టిన వెంటనే రక్తం ముద్దతో మనిషి పురుడు పోసుకుంటాడు. మానవుడు మంచి మనస్సుతో నడుస్తుంటే.. కొన్ని సంఘటనలతో నేరాలకు పాల్పడుతున్నారు. దీంతో కుటుంబాలు రోడ్డునే పడే సందర్భాలను చూస్తుంటే కన్నీటి గాయాలను తుడవడం ఎవరి తరం కాదు. సమాజంలో పిల్లలకు మంచి చదువును నేర్పించి ఉన్నత శిఖరాలకు చేర్చి గర్వపడేలా చేయాలి.

– ఆకెళ్ల రాఘవేంద్ర, సివిల్స్ శిక్షణ నిపుణుడు

పిల్లలకు బంగారు భవిష్యత్తు కల్పిస్తాం



ఐదు నుంచి పదేళ్ల వరకు నేర ప్రవృత్తికి పాల్పడకుండా ఉంటే.. అధికారులతో మాట్లాడి షీట్స్ తొలగించేదుకు కృషి చేస్తాం. మీ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వ గురుకులాల్లో సీట్లు కల్పిస్తాం. సమాజంలో ఆత్మగౌరవం దక్కేలా జీవనం సాగించాలి. చాలా మంది ఆర్థిక ఇబ్బందుల కోసం నేరాలు చేసి జైల్లో దుర్భర జీవితం గడుపుతున్నారు. 'ఇది యాదార్థ ఘటన... భర్త చనిపోవడంతో పిల్లల్ని బతికించుకోవడానికి చిన్నపాటి దొంగతనం చేసింది ఓ మహిళ. జైలు జీవితం అనుభవిస్తున్న ఆమెకు బెయిల్ కోరే దిక్కులేరు. ప్రభుత్వమే ఆమెకు స్వయం ఉపాధి కల్పించడంతో ఆమె పిల్లలతో హాయిగా బతుకుతోంది.' సమాజంలో నేరాలకు పాల్పడకుండా.. సమాజాన్నే నిర్దేశించే లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగితే సాధించలేదంటూ ఏమీ ఉండదు.

– మధుకర్‌స్వామి, డీసీపీ క్రైం

టీ పాయింట్ పెట్టుకుని బతుకుతున్నా..



పలు కారణాలు, మిత్రుల ప్రభావంతో దొంగతనాలు చేశాను. నాపై 104 కేసులు ఉన్నాయి. ఇందులో 11 జిల్లాల్లో 23 కేసులు ఉన్నాయి. పోలీసు కేసులతో సమాజంలో చిన్న చూపునకు గురికావడం బాగా బాధించింది. ఓ పోలీసు అధికారి కౌన్సెలింగ్‌తో పూర్తిగా మారిపోయా. తనపై ఉన్న కేసులు కూడా మాఫీ చేశారు. ప్రస్తుతం ఓ పోలీస్ స్టేషన్ పక్కనే టీ పాయింట్ పెట్టుకుని హాయిగా కుటుంబంతో మంచి జీవనాన్ని సాగిస్తున్నాను.

– ఎం.రాజు, పాత నేరస్తుడు

మార్పు కోసం ముందడుగు వేయాలి



సమాజంలో మార్పు కోసం ముందడుగు వేయాలి. ప్రతి విషయాన్ని ఆచరణలో పెడితినే నడవడికలో మార్పు వస్తుంది. యధార్థ ఘటనలోకి వెళితే.. ఒక నేరస్తుడు దొంగతనానికి పాల్పడి కంప్యూటర్, టీవీని ఎత్తుకెళ్లి పోయాడు. దాని కోసం ఒక పేపర్ యాడ్ ఇచ్చాను. టీవీ వద్దు హార్డ్ డిస్క్ మాత్రమే ఇవ్వాలని కోరాను. దీంతో నేరస్తుడు ఇంటికి వచ్చి హార్డ్ డిస్క్ ఇచ్చి వెళ్తుంటే.. స్వయంగా నేను ఎదురయ్యాను. ఎందుకు ఇలా చేశావని అడిగితే యధార్థ అవసారానికే ఇలా చేశానని బదులిచ్చాడు. నీవు ఏమీ పనిచేస్తావని అడగ్గా.. టిఫిన్ సెంటర్ పెడతానిని చెప్పాడు. రూ.3వేలు అతడికి ఇవ్వగా నేడు కోటీశ్వరుడయ్యాడు. పిల్లల్ని అమెరికాలో చదివిస్తూ 10 మందికి ఉపాధికి కల్పిస్తున్నాడు. ప్రస్తుతం నేరానికి పాల్పడే వారంతా కూడా నచ్చిన రంగాన్ని ఎంచుకుని వ్యాపారాలు, ఉద్యోగాలు చేస్తే ఏదైనా సాధించగలరు. మరీ ముఖ్యంగా సమాజంలో గర్వంగా జీవించగలరు.

– బండి గణేష్, ప్రముఖ సైక్రియాటిస్ట్

బైక్ దొంగతనాలు చేసి మానేశా..



తెలిసీతెలియని వయస్సులో స్నేహితుల వల్ల బైక్ దొంగతనాలు చేశాను. ఎక్కడ బైక్ పోయినా పోలీసులు.. స్టేషన్‌కు పిలవడం మంచిగా అనిపించలేదు. పోలీసులు అవగాహన కల్పించడంతో పూర్తిగా మారి పోయాను. ప్రస్తుతం నాపై ఎలాంటి కేసులు లేవు. అందరిలా పని చేసుకుంటూ.. కుటుంబంతో సంతోషంగా బతుకుతున్నాను.

– అంజి, పాత నేరస్తుడు

సమస్యలపై ఎంపీటీసీలు, సర్పంచ్‌ల గళం

- ప్రజలకు న్యాయం చేయడం లేదంటూ పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓపై ధ్వజం
- వాడీ..వేడిగా కీసర మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ

కీసర: గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామకంఠం భూమి, ఆస్తి మార్పిడీ విషయంతో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓ స్థానికంగా ఉన్న ప్రజలకు తగిన న్యాయం చేయలేకపోతున్నారని, దీంతో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో వారు మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలు, అధికారుల పనితీరుపై ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు.

- యాద్గార్‌పల్లి గ్రామ కార్యదర్శి సుదర్శన్ తమ మాటలను లెక్క చేయడం లేదని, అసలు మండలంలో ఉన్న పంచాయతీ కార్యదర్శులు ఎంపీఓ పర్యవేక్షణలో పనిచేస్తున్నారా? లేదా? అన్న అనుమానం కలుగుతుందని సర్పంచ్, ఎంపీటీసీలు వాపోయారు. యాద్గార్‌పల్లి గ్రామ కార్యదర్శి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
- ఇక వివిధ గ్రామాల్లో గల క్రషన్ మెషిన్ల యాజమాన్యాలు నిబంధనలను తుంగలో తొగ్గి ఇష్టానుసారంగా బ్లాస్టింగ్‌లు చేపడుతున్నా.. ఇటు మైన్స్, అటు రెవెన్యూ, పోలీసు శాఖలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని భోగారం ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. మైన్స్ శాఖ నుంచి ఎంతమందికి ఏ మేర అనుమతులున్నాయో.. తెలపాలని ఇప్పటికి పలుమార్లు సభలో ప్రశ్నించినా ఫలితం లేదన్నారు.
- కరీంగూడ, గోధుమకుంట, జాఫర్‌గూడలకు జల మండలి నుంచి తాగునీటి సరఫరా కావడం లేదని, అయినప్పటికీ గ్రామాల్లో ప్రజలకు నీటి బిల్లులు పంపుతున్నారని, దీంతో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని సర్పంచ్‌లు మహేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, అండాలులు సభ దృష్టికి తీసుకువచ్చారు.
- ఇక వైద్యాధికారి డాక్టర్ సరితారెడ్డి ఆధ్వర్యంలో కొనసాగతున్న కంటివెలుగు, తదితర కార్యక్రమాలను సభలో తెలిపారు. వివిధ గ్రామాల్లో గల శ్మశాన వాటికల్లో విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించాలని పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు కోరారు.
- కీసరలో గల రెండు మద్యం దుకాణాలు ఉదయం 6 గంటల నుంచే మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నాయని, ఎక్సైజ్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కీసర గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ జలాల్‌పురం సత్తిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్ రెడ్డి, ఎంపీడీఓ రమాదేవి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

మహిళల రక్షణపై విద్యార్థినులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శామీర్‌పేట్: మహిళల రక్షణ కోసం షీటీమ్స్ పని చేస్తోందని ఎస్ఐ కిషన్ సింగ్ అన్నారు. శనివారం శామీర్‌పేటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (జగద్గిరిగుట్ట)లోని విద్యార్థినులకు షీమ్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మహిళలను వేధించే ఆకతాయిల ఆట కట్టేందుకు షీ టీమ్స్ కొత్త ప్రణాళికలను సిద్ధం చేస్తోందన్నారు. గతంలో వేధింపులకు గురిచేసి వారిపై ఫిర్యాదు చేసేందుకు మహిళలు ముందుకు వచ్చే వారు కాదని, ప్రస్తుతం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ద్వారా మహిళల నుంచి నేరుగా ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది హనుమంతు, దేవేందర్‌ప్రసాద్, జంగమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో బీ-ఫార్మసీ కోర్సును పూర్తి చేసుకోవాలి

కీసర: బీ–ఫార్మసీ కోర్సు చదివే విద్యార్థులు క్రమశిక్షణతో అత్యంత శ్రద్ధగా తమ కోర్సుకు సంబంధించిన అంశాలపై దృష్టి సారించి మంచి మార్కులతో కోర్సులో ఉత్తీర్ణత సాధించాలని రాంపల్లి కేజీఆర్ కళాశాల చైర్మన్ డాక్టర్ కె.గోవింద్‌రెడ్డి అన్నారు. రాంపల్లిలోని కేజీఆర్ కళాశాలలో శనివారం నిర్వహించిన బీఫార్మసీ కోర్సు విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. అదేవిధంగా ఉత్తమమైన పరికరాలు, సౌకర్యాలు, నాణ్యమైన విద్యనందించడమే ధ్యేయంగా కేజీఆర్ కళాశాల పనిచేస్తోందని, దీనికి విద్యార్థుల సహకారం అవసరమని కళాశాల డైరెక్టర్ పీవీ రమణారావు అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, కోశాధికారి కె.దీపాలి, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించగా.. ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన వివిధ క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.



మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ డాక్టర్ కె.గోవిందరెడ్డి


క్లుప్తంగా

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన



మేడ్చల్‌రూరల్: విద్యార్థులు సీపీఆర్ (కార్డియో పల్మనరి రీసక్సేషన్)పై అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమని సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, సీఎంఆర్ ఆస్పత్రి వైద్యులు అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్‌టీసీ కళాశాలలో శనివారం విద్యార్థులకు నిర్వహించిన సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమంలో బొమ్మల ద్వారా సీపీఆర్ చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ అభినవ్‌రెడ్డి, డైరెక్టర్ రాజిరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓ దుర్గాప్రసాద్‌రెడ్డి, వైద్యులు శివ క్రిష్ణ, అనిల్, లిఖిత, సౌజన్య, అఖిల, విశ్వజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో చైర్ పర్సన్ దీపికరెడ్డి

మేడ్చల్: విద్యార్థులు తమకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపికానర్సింహారెడ్డి అన్నారు. పట్టణంలోని న్యూలిటిల్ లిల్లి పాఠశాలలో పూర్వ ప్రాథమిక విద్య స్నాతకోత్సవంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. కౌన్సిలర్ జంగ హరికృష్ణయాదవ్, పాఠశాల చైర్‌పర్సన్ మంజుల ప్రకాష్, డైరెక్టర్ సాయిదీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయ డయాగ్నోస్టిక్స్‌తో కలిసి చేపట్టిన శిబిరాన్ని కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి ప్రారంభించగా అనంతరం వైద్యులు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలత, డైరెక్టర్ సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, ఏఓ ప్రభాకర్‌రెడ్డి, శక్తివేల్ తదితరులు పాల్గొన్నారు.

లెఫ్టినెంట్ కల్నల్ వినయ్‌భానురెడ్డికి నివాళి



వినయ్‌భానురెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న కీసర గ్రామస్తులు

కీసర: దురదృష్టవశాత్తు అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగిన సైనిక హెలికాప్టర్ ప్రమాదంలో మల్కాజిగిరి నివాసి లెఫ్టినెంట్ కల్నల్ వినయ్‌భానురెడ్డి మృతిచెందాడు. మల్కాజ్‌గిరిలోని దుర్గానగర్‌లో గల ఆయన ఇంటి నుంచి స్వగ్రామం యాదాద్రి–భువనగిరి జిల్లా బొమ్మలరామారం తరలిస్తున్న క్రమంలో వీర మరణం పొందిన జవాన్‌కు కీసర చౌరస్తాలో ప్రజలు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధురి, ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాడతాం



ధర్నాలో పాల్గొన్న బాలమల్లేష్ తదితరులు

కీసర: ఇళ్ల స్థలాలు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు ఎస్.బాల మల్లేష్ అన్నారు. శనివారం కీసర తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో బాలమల్లేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ భూములను బడా బాబులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేస్తుంటే రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ పేదలు 60 గజాముల స్థలంలో గుడిసెలు వేసుకుంటే మాత్రం హుటాహుటిన వాటిని కూల్చేస్తూ పేదలపై దాడి చేస్తున్నారని, పేదలకో న్యాయం.. బడా బాబులకో న్యాయం అమలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. గతంలో కీసరలోని భూదాన్ భూముల్లో ఇళ్లులేని పేదలు సీపీఐ జాతీయ అగ్రనాయకుడు ఏబీ బర్ధన్ నేతృత్వంలో గుడిసెలు వేసుకుంటే ఆరు నెలల తరువాత మీకు ఇళ్ల స్థలాలు ఇస్తామంటే స్వచ్ఛందంగా గుడిసెలు తొలగించి తొమ్మిదేళ్లు పూర్తయినా నేటికీ వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీజీ సాయిలుగౌడ్, తోటపల్లి శంకర్, రొయ్యల కృష్ణమూర్తి, కృష్ణయాదవ్, రవి నాయక్, యాదయ్యగౌడ్, స్వరూప, రాజేశ్వరీ, శ్యామల, లత, యాదగిరి, లక్ష్మణ్, సాయిబాబు, సుజన, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖకు జాతీయ స్థాయి ఇన్నోవేషన్ అవార్డు

23న కేంద్ర మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్న డీఈఓ విజయకుమారి



సాక్షి,మేడ్చల్ జిల్లా: కేంద్ర విద్యా శాఖ ఎన్‌సీఈఆర్‌టీ/ఎన్ఐఈపీఏ ఆధ్వర్యంలో అందజేసే జాతీయ ఇన్నోవేషన్ అవార్డు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖకు దక్కింది. జాతీయ స్థాయిలో విద్యాశాఖ నామినేషన్లను స్వీకరించిన తర్వాత వివిధ స్థాయిల్లో జాతీయ స్థాయి నిపుణులు వాటిని షార్ట్‌లిస్టు చేసి అందులో అత్యంత ప్రభావితమైన ఇన్నోవేషన్‌కు జాతీయ స్థాయిలో విద్యాశాఖ అధికారుల ఇన్నోవేషన్స్ ఆధారంగా అవార్డులు అందజేస్తారు. అందులో భాగంగా జిల్లా విద్యాశాఖ కోవిడ్‌- లాక్‌డౌన్ సమయంలో చేపట్టిన ఇన్నోవేటివ్ కార్యక్రమం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల ద్వారా వీడియో పాఠాలను నాణ్యతగా విద్యార్థులకు అందుబాటులో ఉండేలా 'మేడ్చల్ బడి డాట్ కామ్' అనే వెబ్‌సైట్ రూపొందించారు. జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఇన్నోవేషన్‌కు అవార్డు దక్కడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. ఈ అవార్డును ఈ నెల 23న కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేతుల మీదుగా జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి అందుకోనున్నారు.

పిల్లల చదువు, నడవడికపై దృష్టి పెట్టాలి

మేడ్చల్‌రూరల్: తల్లిదండ్రులు తమ పిల్లల చదువు, వారి నడివడికను నిత్యం గమనించాలని మండల విద్యాధికారి వసంతలత అన్నారు. మండలంలోని పూడూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో శనివారం పేరెంట్–టీచర్ మీటింగ్ నిర్వహించగా సమవేశంలో పాల్గొన్న విద్యాధికారిని తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మధుసుదన్‌రెడ్డి, జగదీశ్, ఎస్ఎంసీ చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బలగం సినిమాలోని నటుడికి సత్కారం

కీసర: బలగం సినిమాలో కొమ్రయ్య పాత్రలో నటించిన సుధాకర్‌రెడ్డిని శనివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడ 5వ వార్డు కౌన్సిలర్ కొత్త సురేఖభాస్కర్‌గౌడ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాజు ముదిరాజ్, కృష్ణ, సాయి, లత, రాము పాల్గొన్నారు.



సుధాకర్‌రెడ్డిని సత్కరిస్తున్న కౌన్సిలర్ కొత్త సురేఖ

రక్త దానం

శామీర్‌పేట్: తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని డియర్ వన్ నియర్ వన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు కొండల్ అన్నారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కొరకు తలసేమియా సిక్లి సొసైటీ సహకారంతో శనివారం మండల పరిధిలోని తుర్కపల్లిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 88 మంది దాతలు రక్త దానం చేశారని నిర్వాహకులు తెలిపారు.

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాలలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి ప్రారంభించగా విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, ఎన్ఎస్ఎస్ అధికారి నాగరాజునాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డ వివాహానికి చేయూత

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామంలో పేదింటి ఆడబిడ్డ వివాహానికి మాజీ ఎంపీపీ పద్మజగన్‌రెడ్డి తన వంతు సాయం అందజేశారు. గ్రామానికి చెందిన మోహన్, శిరీషలకు వివాహం నిశ్చయం కావడంతో వధువుకు ఆమె పుస్తె, మెట్టెలు అందజేశారు.

నల్లపోచమ్మ ఆలయం ప్రారంభం

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధి కిష్టాపూర్‌లో నూతనంగా నిర్మించిన నల్లపోచమ్మ ఆలయం శనివారం ప్రారంభమైంది. నూతనంగా నిర్మించిన ఆలయంలో సంప్రదాయబద్ధంగా అమ్మవారిని ప్రతిష్ఠించి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు, కిష్టాపూర్ వాసులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పారిశుద్ధ్య కార్మికురాలి కుటుంబానికి ఆర్థికసాయం



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య కార్మికురాలు పుష్ప అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందింది. కాగా ఘట్‌కేసర్ చైర్‌పర్సన్ పావనీ జంగయ్యయాదవ్ మృతురాలి కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. పుష్ప కుటుంబాన్ని మున్సిపాలిటీ తరపున ఆదుకుంటామని, మృతురాలికి రావాల్సి ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులను త్వరలోనే విడుదల చేయిస్తామని హామీ ఇచ్చారు.

పేదల గుడిసెలు కూల్చేస్తారా..?: సీపీఎం

ఘట్‌కేసర్: ప్రభుత్వ భూములను రియల్టర్లు కబ్జా చేస్తే కనిపించదు. కానీ.. నిలువ నీడలేని పేదలు గుడిసెలు వేసుకుంటే కూల్చివేసి పేదలను అరెస్టు చేస్తారా అని సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య, మండల కార్యదర్శి సబిత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అవుషాపూర్ సర్వే నంబర్. 93లోని సర్కారు భూమిలో గుడిసెలు వేస్తే అరెస్టు చేయడం, బెదిరించడం, భయాందోళనలకు గురిచేయడం సరికాదన్నారు. మండలంలో కబ్జాకు గురవుతున్న సర్కారు భూములను కాపాడాలని, అర్హులైన పేదలందరికీ రెండు పడకల ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగమణి, అలివేలు, శోభ,జంగయ్య,సాయికుమార్,అరుణ,అనసూయ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్య, సబిత

చెత్త వేరు చేయడంలో మహిళలదే కీలకపాత్ర

మేడ్చల్‌రూరల్: ప్రతీ ఇంటి నుంచి వెలువడే తడి, పొడి చెత్తను వేరు చేయడంలో మహిళలు కీలక పాత్ర పోషించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. మండలంలోని మునీరాబాద్ గ్రామ ంలో శనివారం ఆయన పర్యటించి గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా మార్చేందుకు నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. డీఆర్ డీఓ పద్మజరాణి సమావేశ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దేవసహాయం, డీఆర్‌డీఓ పద్మజారాణి, డీఎల్‌పీఓ స్మిత, గ్రామ సర్పంచ్ గణేశ్, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, ఎంపీడీఓ పద్మావతి, ఎంపీటీసీ రఘు, ఉపసర్పంచ్ నర్సింగ్‌రావు, అధికారు లు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.